క్లుప్తంగా

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

మదనపల్లె సిటీ: స్థానిక గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కె.రంగ నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 20వతేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మూడవ తరగతిలో 40 ఖాళీలు ఉండగా అందులో ఎస్టీలకు 32, ఎస్సీలకు 5, బీసీలకు 2, ఓసీలకు ఒకటి ఖాళీగా ఉన్నాయన్నారు. 4వ తరగతిలో 37, 5వతరగతిలో 30, 6వ తరగతిలో 28, 7వ తరగతిలో 22, 8వ తరగతిలో 22, 9వ తరగతిలో 22 ఖాళీలు ఉన్నాయన్నారు. 4వతరగతి నుంచి 9వ తరగతి వరకు గల ఖాళీలను ఎస్టీ విద్యార్థులతో నింపడం జరుగుతుందన్నారు. సంరక్షకుల సంవత్సరం ఆదాయం లక్షకు మించకూడదన్నారు. వివరాలకు 9490601554ను సంప్రదించాలని కోరారు.

11న మిట్స్ మోడల్ ఈఏపీసెట్


మోడల్ ఈఏపీసెట్ పోస్టర్ల ఆవిష్కరణ

కురబలకోట: అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 11న మోడల్ ఈఏపీసెట్ ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు. ఆదివారం కరస్పాండెంట్ డాక్టర్ నాదేళ్ల విజయభాస్కర్ చౌదరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. అవకాశాన్ని ఇంటర్ పాసైన విద్యార్థులు వినియోగించుకోవాల్సిందిగా కోరారు. వివరాలకు 8712655132, 134,138 ఫోన్ నెంబర్ల ద్వారా సంప్రదించాల్సిందిగా కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

బి.కొత్తకోట: స్థానిక కస్తూర్బా బాలికా విద్యాలయం సమీపంలోని వ్యవసాయ బోరు వద్ద అమర్చిన ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి ధ్వంసం చేశారు. వెంకటా చలపతి అనే రైతుకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు ధ్వంసం చేసి అందులో ఉన్న కాపర్ వైరును అపహరించుకెళ్ళారు. ఈ నేపథ్యంలో ఆదివారం బాధిత రైతు డిస్కం అధికారులకు ఫిర్యాదు చేశాడు. గత నెల రోజుల వ్యవధిలో దుండగులు మూడు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసినట్లు రైతులు పేర్కొన్నారు. అంతేగాక రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేని కారణంగా కడుపు మండిన రైతులు పొలాల వద్దకు వెళ్ళేందుకు ఆసక్తి చూడం లేదు. ఇదే అదునుగా భావించిన దుండగులు డ్రిప్ పరికరాలను అపహరించుకెళుతున్నారని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బాలిక తల్లిదండ్రులకు అప్పగింత

పెద్దతిప్పసముద్రం: మండలంలోని తుమ్మరకుంట పంచాయతీ కొత్తపల్లికి చెందిన ఓ మైనర్ బాలిక (17) మూడు రోజుల క్రితం అదృశ్యమైంది. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ హరిహర ప్రసాద్ కేసు నమోదు చేసిన విషయం పాఠకులకు విదితమే. ఈ నేపథ్యంలో బాలిక బెంగళూరులోని వారి మేనమామ ఇంట్లో తలదాచుకుంది. సదరు మేనమామ ఆదివారం బాలికను పోలీసులకు అప్పగించాడు. మరో ఐదు నెలల్లో కన్నవాళ్ళు చేస్తున్న పెళ్ళి ప్రయత్నాలు తనకు ఇష్టం లేకపోవడంతో ఇంటి నుంచి బంధువుల ఇంటికి వెళ్లినట్లు బాలిక పోలీసుల ఎదుట వెల్లడించింది. అనంతరం పోలీసులు బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కందుకూరు సమీపంలోని పర్తిగడ్డ వద్ద పట్టెంవాండ్లపల్లికి చెందిన నారాయణమూర్తి (45) ఆదివారం ద్విచక్ర వాహనంలో వెళుతూ ప్రమాదవశాత్తు గాయపడ్డాడు. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మదనపల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

బోదేషావలికి శ్రామిక శక్తి అవార్డు


అవార్డు అందుకుంటున్న ఆటో యూనియన్ అధ్యక్షుడు బోదేషావలి

పీలేరు : పీలేరుకు చెందిన బిస్మిల్లా ఆటో యూనియన్ అధ్యక్షుడు బోదేషావలికి శ్రామిక శక్తి అవార్డు లభించింది. తిరుపతి ఈఎస్ఐ హాస్పిటల్‌లో నిర్వహించిన సమావేశంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్యాంబాబు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఆటో కార్మికుల కోసం నిరంతరం పోరాడుతూ వారి సమస్యల పరిష్కారం కోసం చేసిన కృషిని గుర్తించి అవార్డు అందజేసినట్లు తెలిపారు. ఈ అవార్డుతో తనకు మరింత బాధ్యత పెరిగిందని, తమ పోరాటాన్ని కొనసాగిస్తానని చెప్పారు. కార్యక్రమంలో రత్నకుమార్, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం


ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయం


ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

- నేటి నుంచి ప్రసన్న వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు
- 16వతేదీ వరకు ఉత్సవాల నిర్వహణ
- ప్రతి రోజు ఒక్కో వాహనంలో స్వామివారు భక్తులకు దర్శనం

మదనపల్లె సిటీ: స్థానిక దేవళంవీధిలోని ప్రసన్న వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలకు ఆలయం ముస్తాబైంది. ప్రతి ఏడాది నిర్వహించే బ్రహ్మోత్సవాలు ఈ ఏడాది అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈనెల 5వతేదీ నుంచి 16వతేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ప్రతి రోజు స్వామి ఒక్కో వాహనంలో భక్తులకు దర్శనం ఇస్తారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని రంగు రంగు విద్యుత్‌దీపాలతో అలంకరించారు. భక్తుల కోసం క్యూలైన్లు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం ప్రత్యేక పూజలు, సాయంత్రం వాహన సేవలు ఉంటాయి.

ఉత్సవాల వివరాలు:
5వతేదీ (సోమవారం) ఉదయం మూలవర్లకు, ఉత్సవ విగ్రహములకు తిరుమంజన సేవ, సాయంత్రం విశ్వక్సేనుడు ఆరాధన, అంకురార్పణ, 6వతేదీ ఉదయం అభిషేకం, కలశస్థాపన, హోమాలు, ధ్వజారోహణం, ఉదయం సూర్యప్రభవాహనం, సాయంత్రం చంద్రప్రభ వాహనం నిర్వహిస్తారు. 7వతేదీ సాయంత్రం సింహవాహనం, హనుమంత వాహనం, 8వతేదీ సాయంత్రం గజవాహనం, 9వతేదీ సాయంత్రం హంసవాహనం, పెద్ద శేషవాహనంపై స్వామివారు ఊరేగింపు నిర్వహిస్తారు. 10వతేదీ సాయంత్రం సర్వభూపాల వాహనం, 11వతేదీ సాయంత్రం మోహినీ ఉత్సవం(కల్పవృక్షవాహనం), 12వతేదీ సాయంత్రం శ్రీవారి కళ్యాణోత్సవం, రాత్రి గరుడోత్సవం నిర్వహిస్తారు. 13వతేదీ ఉదయం మడుగుతేరు బ్రహ్మరథోత్సవం, 14వతేదీ సాయంత్రం అశ్వవాహనం, ధ్వజ అవరోహణం, 15వతేదీ ఉదయం స్నపన తిరుమంజనం, సాయంత్రం ఊంజలసేవ, రాత్రి శయనోత్సవం జరుగుతుంది. 16వతేదీ సాయంత్రం పుష్పయాగంతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ ఈఓ రమణ, మాజీ కమిటీ చైర్మన్ బింగి పాండు, మాజీ సభ్యులు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. భక్తులు ఉత్సవాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

నాణ్యమైన మామిడికి మంచి ధర

జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు


మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు

పీలేరు : నాణ్యమైన మామిడికి మార్కెట్‌లో మంచి గిట్టుబాటుధర లభిస్తుందని జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు అన్నారు. ఆదివారం మండలంలోని తలపుల అన్నమయ్య రైతు సహకార సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట కోంత సమయానికి మూడు వారాల ముందు డెల్టామెతరిన్ 0.5 మిల్లీలీటరు, అజాడిడిరెక్టిన్ 2 మిల్లీలీటరును లీటరు నీటికి కలపి పిచికారి చేయాలని కోరారు. ఫ్రూట్ కవర్స్ వాడటం వలన పండు ఈగ, కాయ తొలుచుపురుగు, తామర పురుగుల నుంచి కాయల్ని కాపాడుకోవచ్చునని తెలిపారు. దీంతో పురుగుమందుల అవశేషాలు లేని ఉత్పత్తులను పొందవచ్చునని చెప్పారు. రంగు, నాణ్యత, పరిమాణం పెరగడం తోపాటు ఎండ తాకిడి నుంచి పండ్లను కాపాడుకోవచ్చునని తెలిపారు. స్థానిక అన్నమయ్య రైతు సహకార సంఘం అధ్యక్ష జయబ్బనాయుడు మాట్లాడుతూ తమ సంఘం అన్ని రకాల మామిడి కాయలను మంచి ధరతో కొనుగోలు చేస్తామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్లోబల్ ఫ్యాక్టరీ ప్రతినిధి చంద్రమౌళి, ఉద్యానశాఖ అధికారి సుకుమార్‌రెడ్డి, బోదేషావలి, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో బహుళ ప్రయోజనాలు


సర్టిఫికెట్ అందజేస్తున్న డాక్టర్ పి.వి.ఎస్.లక్ష్మీ

పీలేరు : యోగా అభ్యసనంతో బహుళ ప్రయోజనాలు పొందవచ్చునని స్థాని శ్రీ దివ్య యోగ విద్యాలయం అధ్యక్షురాలు డాక్టర్ పి.వి.ఎస్. లక్ష్మీ అన్నారు. ఆదివారం యోగా శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు యోగశ్రీ సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా స్థానిక వీఎస్ఎన్ సిద్ధార్థ పాఠశాలకు చెందిన 30 మంది విద్యార్థులకు, భువన విద్యాలయంకు చెందిన 40 మంది విద్యార్థులకు, కలికిరి సాంఘిక సంక్షేమ మహిలా డిగ్రీ కళాశాలలో 200 మంది విద్యార్థులు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


హాకీ సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్న క్రీడాకారులు, కోచ్‌లు

మదనపల్లె సిటీ: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ పీడీ ప్రసాద్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక బీటీ కాలేజీ హాకీ మైదానంలో ఉచిత హాకీ క్యాంప్ క్రీడాకారులతో 4 కె రన్ నిర్వహించారు. సమ్మర్ క్యాంపు ఈనెల 30వతేదీ వరకు జరుగుతుందన్నారు. ఉదయం, సాయంత్రం జరిగే క్యాంప్‌లో కోచ్‌లు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను మైదానాలకు పంపాలన్నారు. వారికి నచ్చిన క్రీడలో శిక్షణ ఇప్పించాలన్నారు. అవకాశన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కోచ్‌లు నౌషాద్, దిలీప్,గౌస్ పాల్గొన్నారు. అనంతరం దీక్ష పాఠశాల ఆధ్వర్యంలో హాకీ క్రీడాకారులకు అల్పాహారం అందజేశారు.

పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేద్దాం


పార్టీ జెండా ఆవిష్కరించిన మైఫోర్స్ మహేష్, జయభవ్యకిషోర్ తదితరులు

మదనపల్లె : రాజంపేట పార్లమెంటరీ పరిధిలో జనసేన పార్టీ బలోపేతమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైఫోర్స్ మహేష్ అన్నారు. ఆదివారం జనసేన మహిళా నాయకురాలు జయభవ్యకిషోర్ ఆధ్వర్యంలో బైపాస్‌రోడ్ కొండామారిపల్లె సర్కిల్‌లో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మైఫోర్స్ మహేష్ మాట్లాడుతూ...వచ్చే ఏడాదిలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు క్యాడర్ ఇప్పటి నుంచే సమాయత్తం కావాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి అడపాసురేంద్ర, అమరనారాయణ, తోటకల్యాణ్, పుంగనూరు రమణ, శివప్ప నాయుడు, రెడ్డిరాణి, రమశ్రీనివాసులు, రవి, కామిశెట్టి సుధాకర్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డెమ్మ తల్లీ..కరుణించమ్మా


అమ్మవారి ఎదుట వరపడిన మహిళలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయంలో ఆదివారం భక్తులు అమ్మవారికి పూజలు చేసి కరుణించమ్మా అని వేడుకున్నారు. భక్తుల రద్దీతో అమ్మవారి ఆలయం కిటకిటలాడింది. అమ్మవారికి వేకువజామునే నైవేద్యాలు సమర్పించి విశేష పూజలు,అభిషేకాలు చేశారు. మహిళలు అమ్మవారి కోనేట్లో పవిత్ర స్నానమాచరించి సంతానం కోసం వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు. పలువురు భక్తుల ఆలయమెట్లకు పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడం విశేషం.

మహాభారత యజ్ఞం పూర్వ జన్మసుకృతం

కలకడ : మహాభారత యజ్ఞం నిర్వహించడం పూర్వజన్మసుకృతం అని మాజీ ఎంపీపీ శ్యామలకాంతారావు అన్నారు. ఆదివారం మండలంలోని కోన పంచాయతీ తిప్పిగారిపల్లెలో ధర్మకర్తగా 18వ ఏడాది మహాభారతయజ్ఞం ప్రారంభించారు. కలియుగంలో కూడా మహాభారతంపై మక్కువ కలిగి ఉన్నారంటే అందులోని సారాంశం ఎంతో విలువైందని గుర్తుచేశారు. పగలు చలువపందిరి నీడలో హరికథ కాలక్షేపం, రాత్రి కళాకారులచే నాటకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు


కలశస్థాపన వద్ద పూజలు చేస్తున్న భాస్కరాచారి

మదనపల్లె సిటీ: స్థానిక కదిరిరోడ్డులోని శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆదివారం ఆరాధన మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు సుప్రభాతసేవ, మహాగణపతి పూజ, స్వస్తివాచనము, కలశస్థాపన, అంకుర్పారణ, ధ్వజారోహణం జరిగింది .అనంతరం భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో నవయుగ స్వర్ణకార సంఘం అధ్యక్షులు అప్పినపల్లి భాస్కరాచారి, ఆలయ అధ్యక్షులు లక్ష్మీనారాయణాచారి సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులచే పనులు చేయించిన వారిపై చర్యలకు ఆదేశం

కలికిరి: కలికిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గతంలో విద్యార్థులచే సిమెంటు ఇటుకలు మోయించడం, సిమెంటు పనులు చేయించిందని తిరుపతికి చెందిన సామాజిక కార్యకర్త తూపల్లి నందకిశోర్ జాతీయ బాలల హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసి, సంబంధిత ఆధారాలను అందజేశారు. ఈ మేరకు స్పందించిన బాలల హక్కుల కమిషన్ సంబంధిత పాఠశాలలో జరిగిన ఘటనకు సంబంధించి విద్యార్థులచే పనులు చేయించిన బాధ్యులపై కేసు నమోదుతో పాటు సమగ్ర నివేదిక అందజేయాలని జిల్లా కలెక్టరుకు ఉత్తర్వులు జారీ చేశారు.

ఘనంగా ఉలవల గంగమ్మ జాతర ప్రారంభం


బోనాలు తీసుకెళుతున్న మహిళలు

పీలేరు రూరల్ : మండలంలోని తలపుల పంచాయతీలో శ్రీ ఉలవల గంగమ్మ జాతర ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఆదివారం ఉదయం అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు బోనాలు మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాల వితరణ, అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. రాత్రి పొద్దుటూరి వాస్తవ్యులు భక్త చింతామని నాటకం నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు వెంకటరమణనాయుడు, మల్లికార్జుననాయుడు, సాగర్‌రెడ్డి, హరినాథనాయుడు, మల్లయ్యనాయుడు పాల్గొన్నారు.

పోలీసులు సివిల్ కేసుల్లో తలదూర్చవద్దు

మదనపల్లె డీఎస్పీ మహేంద్ర


ముదివేడు స్టేషన్‌లో మాట్లాడుతున్న మదనపల్లి డీఎస్పీ మహేంద్ర

కురబలకోట: భూ తగాదాల పాటు సివిల్ వివాదాల్లో తలదూర్చవద్దని, వాటికి దూరంగా ఉండాలని మదనపల్లి డీఎస్పీ ఎస్. మహేంద్ర పోలీసులకు గట్టిగా సూచించారు. ఆదివారం ఆయన ముదివేడు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. పరిసరాలను పరిశీలించారు. స్టేషన్ పైకప్పు ఆధునీకరణ గావించడం, పోలీస్ స్టేషన్‌కు తారు రోడ్డు, గార్డెనింగ్, పరిసరాలు ఆహ్లాదకరంగా ఉన్నాయని ఎస్ఐ దిలీప్‌కుమార్‌ను అభినందించారు. రౌడీషీటర్లు, పాత నేరస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులను సత్వరం పరిష్కరించాలన్నారు. అసాంఘిక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. భూ, సివిల్ వివాదాలలో జోక్యం చేసుకోవద్దని మరోసారి స్పష్టం చేశారు. వాటి పరిష్కారానికి ప్రయత్నించవద్దన్నారు. గతంలో ఎలా ఉన్నా ఇక మీదట పద్ధతి మార్చుకోకపోతే చిక్కులు తప్పవని హెచ్చరించారు. ఆరోపణలు విచారణలో తేలితే చర్యలు తప్పవన్నారు. శాఖా పరంగా కూడా ఇంటర్నల్ ఇన్వెస్టిగేషన్ ఉంటుందన్నారు. అంతేగాకుండా సివిల్ వివాదాలను ఉద్దేశపూర్వకంగా క్రిమినల్ కేసులుగా మార్చడం లేదంటే వేధింపులకు పాల్పడటం లాంటివి చేయరాదన్నారు. ఇలాంటి సంఘటనల్లో బాధితులు తమ దృష్టికి తీసుకువస్తే బాధ్యులపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. నేరాల దర్యాప్తు, వాటి నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ వంటి చట్టపరమైన ఆదేశాలను అమలు చేయాలన్నారు. వేసవి మండుటెండల్లో విధినిర్వహణతో పాటు ముఖ్యంగా వ్యక్తిగత ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలని పోలీసులకు సూచించారు. అధిక బరువు వల్ల అలసట ఆయాసంతో పాటు ఇతర సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. శారీరక ధృఢత్వం కోసం ఆరోగ్య సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం


వివాహ వేడుకలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నిసార్‌అహ్మద్ తదితరులు

మదనపల్లె : చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం వి.కోటకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గౌస్ కుమారుడు సయ్యద్ షాజిల్ వివాహ వేడుకలో మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. మదనపల్లె వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్‌తో కలిసి ఆదివారం చేనేతనగర్ కేఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో వివాహ వేడుకకు హాజరైన ఆయన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. పెళ్లికి హాజరైన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరినీ ఆత్మీయంగా పలకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బైరెడ్డిపల్లె రెడ్డెప్ప, లూబీ విశ్వనాథ్, యూనస్, చరణ్, శ్రీకాంత్, మల్లికార్జున, సాదిక్, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాల అమలు ఎప్పుడు?


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు

పీలేరు రూరల్ : కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలు ఎప్పుడు అమలు చేస్తుందో చెప్పాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణప్ప, సాంబశివ అన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని అప్పులు పాలు చేసి ప్రజలపై భారాలు మోపుతున్నారని ఆరోపించారు. యువగళం పేరుతో 20 లక్షల మందికి ఉద్యోగాల కల్పన, నిరుద్యోగ భృతి ఇస్తామన్న హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. తల్లికి వందనం పేరుతో ఇంట్లో ప్రతి విద్యార్థికి ఏటా రూ. 15 ఇస్తామని విద్యా సంవత్సరం పూర్తైనా ఇవ్వలేదని తెలిపారు. మహాశక్తి పథకం, ఆడబిడ్డ నిధి, 18–59 సంవత్సరాల ప్రతి మహిళకు నెలకు రూ. 1500 ఇస్తామని ఇవ్వలేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ పథకాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. జమ్ముకాశ్మీర్ పహల్గామ్‌లో టూరిస్టులపై ఉగ్రవాద దాడిని ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గం కార్యదర్శి టిఎల్. వెంకటేష్, ఏఐటీయూసీ నియోకవర్గ కార్యదర్శి నరసింహులు, నాయకులు రమేష్, రెడ్డికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అదనపులోడు క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ

ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ గంగాధరం

మదనపల్లె : మదనపల్లె డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు అదనపు లోడు క్రమబద్ధీకరణకు ఏపీఎస్పీడీసీఎల్ సంస్థ 50 శాతం రాయితీ ప్రకటించిందని ఈఈ గంగాధరం తెలిపారు. ఆదివారం ఏపీఎస్పీడీసీఎల్, మదనపల్లె డివిజన్ కార్యాలయం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో.. మార్చి 1వ తేదీ నుంచి అదనపులోడు క్రమబద్ధీకరణకు ప్రకటించిన 50 శాతం రాయితీ అమలవుతోందని, జూన్ నెలాఖరువరకు గడువు ఉంటుందన్నారు. ఇప్పటివరకు చాలా తక్కువ మంది మాత్రమే ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకున్నారన్నారు. గడువులోగా వినియోగించుకోకుంటే ఎక్కువ మొత్తం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం ప్రతి ఇంట్లో విద్యుత్తు వినియోగం పెరిగిందని, వేసవిలో ఏసీలు, ఫ్యాన్లు ఎక్కువగా ఉపయోగిస్తున్నారని, దీని కారణంగా అదనపులోడు చాలామందికి సాధారణమవుతోందన్నారు. 1 కిలోవాట్‌కు అసలు ధర రూ.2,250 చెల్లించాల్సి ఉండగా, ప్రస్తుతం రాయితీ పోను కిలోవాట్‌కు రూ.1,250 చెల్లిస్తే సరిపోతుందన్నారు. 2 కిలోవాట్‌కు రూ.4,450కు... రూ.2,450, 3 కిలోవాట్‌కు రూ.6,650కు రూ.3,650 , 4 కిలోవాట్‌కు రూ.8,850కు గాను రూ.4,850, 5 కిలోవాట్‌కు రూ.11,050కు రూ.6,050 రాయితీ ధర చెల్లించాలన్నారు. విద్యుత్తు వినియోదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం


కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ మహేష్‌రెడ్డి

మదనపల్లె సిటీ: స్థానిక ఎన్జీవో హోంలో ఏపీఎన్జీవో, పెన్షనర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఎన్జీఓ అసోసియేషన్ అధ్యక్షులు నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి మూడు నెలలకు ఒకసారి కంటి పరీక్షలు చేసుకోవాలని సూచించారు. శిబిరంలో 65 మంది ఉద్యోగులకు రమా నేత్రాలయ కంటి వైద్యులు డాక్టర్ మహేష్‌రెడ్డి కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎన్జీవో అసోసియేషన్ కార్యదర్శి రెడ్డిశేఖర్, గిరిధర్‌రెడ్డి, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నరసింహులు, కార్యదర్శి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గర్నిమిట్ట యల్లమ్మ సోలెం ఊరేగింపు


యల్లమ్మ సోలెం ఊరేగిస్తున్న దృశ్యం

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్ట యల్లమ్మతల్లి సోలెం ఊరేగింపు ఘనంగా ప్రారంభించారు. గర్నిమిట్ట యల్లమ్మ జాతరకు మూడు వారాల ముందుగా అమ్మవారి సోలెం ఊరేగింపు చేపట్టడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఆదివారం అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద నుంచి మంగళవాయిద్యాలతో అమ్మవారి సోలెం ఊరేగింపు ప్రారంభించారు. మూడు వారాల పాటు గర్నిమిట్ట, కేవీపల్లె పంచాయతీల్లోని గ్రామాల్లో సోలెం ఊరేగింపు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ సురేష్‌రెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


గురువులతో పూర్వ విద్యార్థులు

గుర్రంకొండ: స్థానిక తెలుగు జెడ్పీహైస్కూల్లో 1985–86 సంవత్సరంలో పదవ తరగతి చదువుకొన్న వారంతా ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. చిరకాల జ్ఞాపకాలను అందరూ నెమరు వేసుకొన్నారు. తమకు చదువుచెప్పిన ఉపాధ్యాయులను డీజేలతో ఊరేగించి స్థానిక గోల్డెన్ ప్లాజా కల్యాణ మండపం వద్దకు తీసుకొచ్చారు. అక్కడ గురువులను ఘనంగా సన్మానించారు. గురువులకు బహుమతులను అందజేశారు. గురువులు తమ అమూల్యమైన సందేశాలను ఇచ్చారు. అంగవైకల్యంతో బాధపడుతున్న తోటి సహచరులు శ్రీనివాసులు, షహనాజ్‌లకు మూడుచక్రాల ద్విచక్ర వాహనాలను సాయంగా అందించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, భరతనాట్య ప్రదర్శనలు అందర్నీ ఆకట్టుకొన్నాయి. కార్యక్రమంలో జెడ్పీటీసీ సప్రీన్‌ముక్తియార్, మాజీ సర్పంచ్ సుంకరశేఖర, లైబ్రేరియన్ ఇందుశేఖర్, బ్యాంక్‌ఉద్యోగి కన్నా, రవి, అనసూయ, సరస్వతి, భూదేవి, శోభ, సిద్ధలక్ష్మీ, నాగేంద్ర, మురళీ, మన్సూర్, శేఖర, సూరి, ఫిరోజ్‌లు పాల్గొన్నారు.